క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధి గ్రీన్ ఫీల్డ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరా యం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాదర్‌గుల్‌లోని కురుమల్‌గూడ, రాజీవ్‌గృహకల్పతో పాటు, తుర్కయంజాల్‌లోని కుర్మ గూడలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4వరకు ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నాదర్‌గుల్ ఇండస్ట్రీయల్ ఏరియాలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజనీర్ కే రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ మారుతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ పరిధిలోని మోర్, అష్టలక్ష్మీ, అలకాపురి, వాసవికాలనీ, యాదవనగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, గ్రీన్‌హిల్స్‌కాలనీ, హరిపురి, చిత్రలేఅవుట్, ఖిల్లామైసమ్మ, సిరికాలనీ, స్టేడియం, శివగంగకాలనీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని, ఆలిండియా రేడియోస్టేషన్ ఫీడర్ పరిధిలో ఉద యం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, ప్రజయ్‌నివాస్, గణేష్‌నగర్, సౌత్ ఎండ్‌పార్కు, జైపురికాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యా హ్నం 1గంట నుంచి 2 గంటల వరకు, శివపా ర్వతి, సౌత్‌ఎండ్‌పార్కు, జైపురికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు, సాయినగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామకృష్ణ పేర్కొన్నారు.

20 నుంచి సుందరకాండ పారాయణం

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ శ్రీనివాసనగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అయోధ్య శ్రీరామచంద్ర స్వామి వారి ఆలయ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఈ నెల 20 నుంచి 22 తేదీ వరకు సుందరకాండ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు మోటుపల్లి లక్ష్మీరామాచార్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న సుందరకాండ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, 21న నిత్యారాధన, సుందరకాండ పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం. 22న సీతారామచంద్రస్వామి కల్యాణం, అయోధ్యలో రామచంద్రస్వామి వారి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా శ్రీరామజపం మహానివేదన, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, నగర సంకీర్తన నిర్వహిస్తామన్నారు.

కారు అదుపుతప్పి.. ఒకరికి తీవ్రగాయాలు

చైతన్యపురి: కారు అదుపు తప్పిన రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపార సముదాయంపై దూసుకెళ్లడంతో ఒక వ్యక్తికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. చైతన్యపురి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. అల్కాపురిలో నివసించే ప్రైవేట్ ఉద్యోగి యాదగిరి మంగళవారం కారు (ఏపీ 29ఎల్ 5750)లో భార్యతో కలిసి ఆర్‌కే పురం నుంచి స్పైసీ హబ్ వైపు వెళ్తున్నాడు. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మూడు ద్విచక్ర వాహనాలు, ఒక టీ స్టాల్‌పై దూసుకెళ్లింది. టీ స్టాల్ వద్ద నిల్చుని ఉన్న జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్ కుమార్‌ను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మోకాళ్లు, తలకు గాయాలు కావడంతో సమీపంలోని సాయి సంజీవని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో శ్రీనివాస్ అనే మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కారు నడుపుతున్న యాదగిరికి బీపీ పెరగడంతో కారు అదుపు తప్పినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అర్హులకు పథకాలు ఇవ్వాలని అభ్యర్థన

కడ్తాల్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్ అలీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించిన ఆరు గ్యారంటీ స్కీంలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని స్పీకర్‌ను కోరారు.

బహుమతుల ప్రదానం

ఇబ్రహీంపట్నం: కర్ణంగూడలో జరిగిన కేపీఎల్-3 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ మ్యాచ్‌లో రెడ్ టీమ్ విన్నర్‌గా నిలువగా, బ్లూ టీమ్ రన్నర్‌గా నిలిచాయి. మొదటి బహుమతి కింద రూ.21,116, రెండవ బహుమతి కింద రూ.11,116ల నగదు షీల్డ్‌లను గ్రామ పెద్దలు నల్లబోలు శ్రీనివాస్‌రెడ్డి, బీమ్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి అందజేశారు.

ఆధార్.. ఇదేం బేజార్!

ప్రజలకు ప్రస్తుతం ఆధార్ కార్డు తప్పనిసరిగా మారింది. ప్రభుత్వానికి సంబంధించి ఏ పథకం లబ్ధి పొందాలన్నా, దరఖాస్తు చేయాలన్న ఆధార్ కీలకం అయింది. అందుకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి ఆధార్ వివరాలను నవీకరించాలి. దీనికి నమోదు కేంద్రాలు దోహద పడతాయి. ఏడాది కాలంగా కందుకూరు మండలంలో నమోదు కేంద్రం లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.


మూతపడిన ఆధార్ నమోదు కేంద్రం

- ఏడాదిగా మూతపడిన ఆధార్ నమోదు కేంద్రం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- ఇతర మండలాలకు వెళ్లాల్సిన దుస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కందుకూరు: ఆధార్ నమోదు కేంద్రం మూతపడి ఏడాది కావస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఏ ప్రభుత్వ పథకం వర్తించాలన్నా, బ్యాంకులకు కేవైసీ చేయాలన్నా, ఇతర చోట్ల ఎక్కడ చూసినా ఆధార్ కార్డు వివరాలు తప్పనిసరి. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సైతం ప్రస్తుతం ఆధార్ నమోదు కేంద్రం పని చేయడం లేదు. మండల కేంద్రంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రం మూత పడటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇతర మండలాల్లోని కేంద్రాల వద్దకు వెళ్లి పడిగాపులు కాచి పనులు చేసుకుని రావాల్సిన దుస్థితి నెలకొంది. ఇది కందుకూరు మండలంలోని ప్రజల పరిస్థితి.

తెరుచుకోని కేంద్రం

మండల పరిధిలోని అన్ని గ్రామాలకు కలిపి కేవలం కందుకూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రం ఉండేది. అదీ కూడా ఏడాది కాలంగా మూతపడింది. దీంతో ఆధార్ కార్డులో తప్పొప్పులు సరిచేసుకోవడానికి లేదా కొత్త ఆధార్ కార్డులు తీసుకోవడానికి, ఆధార్‌లో ఇంటి అడ్రసు మార్చుకోవడానికి, బ్యాంకులు, రైతు బంధు పథకాలకు కేవైసీ చేసుకోవడానికి ఇక్కడి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. అందుబాటులో ఆధార్ నమోదు కేంద్రం లేక యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలకు వ్యయప్రయాసలకు ఓర్చి వెళ్లి పనులు చేసుకుని రావాల్సిన దుస్థితి నెలకొంది. కాగా మహేశ్వరంలో ఆరు నెలలు మూతపడిన ఆధార్ కేంద్రం ఇటీవలే తెరుచుకుంది. ఇక్కడా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోవచ్చు

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసుకోవడానికి ఎవరైనా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకుంటే అర్హులను గుర్తించి కేటాయిస్తారు. కొత్త వారికి అవకాశం కల్పిస్తాం. ఆసక్తి ఉన్న వారు కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
– గోపాల్, తహసీల్దార్, కందుకూరు


అష్టలక్ష్మి ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు


చంపాపేట యాదగిరికాలనీ సంక్షేమ సంఘం భవనంలో..

కమనీయం.. గోదాదేవి కల్యాణం


ఆదిత్యానగర్‌లో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సాయినగర్‌లోని దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో ...

మన్సూరాబాద్/నాగోలు/చాదర్‌ఘాట్/దిల్‌సుఖ్‌నగర్: గోదారంగనాథ కల్యాణ మహోత్సవాన్ని ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం వైభవంగా నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్ ఆదిత్యానగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు.

◆ నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో, చంపాపేట డివిజన్ యాదగిరినగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం భవనంలో టీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు.

◆ కొనగుండ్ల ఫణిగిరి లక్ష్మీనరసింహస్వామి గుడిలో గోదాదేవి కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, చావా సత్య నాగ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమారెడ్డి, ఈఓ జోషి మార్తాండరావుల ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం జరిపించారు. శ్రీపోచమ్మ ఆలయ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్‌కేపురం డివిజన్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించారు.

మనసుదోచే ముగ్గులు.. పతంగుల పోటీలు


సరస్వతినగర్‌లో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ


ఎల్‌బీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌పై నుంచి గాలిపటాలను ఎగురవేస్తున్న యువత

మన్సూరాబాద్: సంక్రాంతి పండుగ సంబురాలను ఎల్‌బీనగర్‌లో పలు ప్రాంతాల్లో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచే మహిళలు తమ ఇంటి ముందు కళ్లాపి చల్లి రంగు రంగులతో అందమైన ముగ్గులు వేశారు. పలు ప్రాంతాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. యువత గాలిపటాలను ఉత్సాహంగా ఎగురవేశారు. పలు అపార్ట్‌మెంట్ల టెర్రస్‌పై నుంచి యువత గాలిపటాలను ఎగురవేశారు. పలు అపార్ట్‌మెంట్స్‌లో ఇండోర్ గేమ్స్ నిర్వహించి బహుమతులను అందజేశారు.

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి నివాసంలో డూడూ బసవన్నల, గంగిరెద్దుల కోలాహలం నడుమ సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఆర్‌కేపురం మహిళా మండలి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మండలి అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ, కార్యదర్శి రాధ తదితరులు పాల్గొన్నారు.


నాగోలులోని ఓ అపార్ట్‌మెంట్ ఆవరణలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

రైతుబంధు నగదు జమ చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

యాచారం: యాసంగి ప్రారంభమైన రైతుబంధు నగదు ఇంకా జమ కాలేదని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేయాలని సూచించారు. పెట్టుబడులకు నిధులు లేక రైతులు అప్పులు చేసే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ పంటల రుణాలకు కూడా రూ.2 లక్షల వరకు మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

మార్గం రాజేశ్‌కు 'కొనతాల రామలింగస్వామి' అవార్డు



రాజేశ్‌కు అవార్డు అందజేస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, లక్ష్మీపార్వతి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: అనాథ, నిరుపేద విద్యార్థులకు మార్గం రాజేశ్ మూడు దశాబ్దాలుగా ఉచితంగా భోజన, వసతి, విద్య సౌకర్యాలు కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు కృషి చేయడం వెలకట్ట లేనిదని రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో సోమవారం రాత్రి డాక్టర్ కొనతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్టు 4వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అనాథ విద్యార్థి గృహం ద్వారా పేద విద్యార్థుల కోసం నిస్వార్థ సేవ చేస్తున్న రాజేశ్‌కు ఈ సందర్భంగా యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేతుల మీదు కొనతాల రామలింగస్వామి మెమోరియల్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కొనతాల లక్ష్మీపార్వతి, అనకాపల్లి వివేకానంద విద్యా సంస్థల అధినేత, ట్రస్టు ప్రధాన కార్యదర్శి మళ్ల జగదీశ్, ట్రస్టు సలహాదారు ఫణిభూషణ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు: చిప్పలపల్లిలో బహుమతులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

సంక్రాంతి సందడి

- పతంగులు ఎగురవేసిన చిన్నారులు
- ఆకట్టుకున్న రంగవల్లులు


కందుకూరులో ఓ ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

మహేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు మకర సంక్రాంతి, కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు ఇళ్ల ఎదుట రంగు రంగుల రంగవల్లికలు వేశారు. అలాగే చిన్నారులు గాలిపటాలు ఎగరవేస్తూ సందడిగా గడిపారు. పలు గ్రామాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో కబడ్డీ, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా యువత, విద్యార్థులు సందడి చేశారు. గృహిణులు రకరకాల పిండి వంటలు తయారు చేసి సరదాగా గడిపారు.

బంధువులతో ఆనందంగా..

కందుకూరు: మండల పరిధిలో సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకొన్నారు. ఇళ్ల ముంగిట మహిళలు, చిన్నారులు ముగ్గులు వేసి రంగులు అద్ది, గొబ్బెమ్మలు పెట్టి పండుగకు స్వాగతం పలికారు. అనంతరం పిండి వంటలు చేసి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబీకులు, బంధువులతో గ్రామాలు సందడిగా మారాయి.

చిప్పలపల్లిలో ముగ్గుల పోటీలు

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లిలో జైహనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో అంబటి భార్గవి, ద్వితీయ స్థానంలో అంబటి భవిష్య, తృతీయ స్థానంలో కాసోజు భవానీ నిలిచారు. కాగా విజేతలుగా నిలిచిన వారికి ఎంపీటీసీ సభ్యురాలు లలితకుమార్, ఇన్‌చార్జి సర్పంచ్ బాలకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంబటి యాదగిరి, గోపాల్‌దాస్ జంగయ్య, సామనేటి బాలరాజ్, పోలమోని రమేష్, జైహనుమాన్ యూత్ అధ్యక్షుడు మామిళ్ల రాజు, ప్రధానకార్యదర్శి కాసోజు సాయికిరణ్, వార్డు సభ్యులు మౌనిక, రమాదేవి, శ్రీనివాస్, శరత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సంఘాల కృషి ఎనలేనది


జైగణేష్ భక్త సమితి సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

నాగోలు: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. జై గణేష్ భక్త సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ బి. విజయరంగా, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌లు ఎమ్మెల్సీ దయానంద్ గుప్తాను మంగళవారం కలిసి తమ సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దయానంద్‌గుప్తా మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ పాత్రతో సామాజిక సంఘాలు చేస్తూ కార్యక్రమాలను అభినందించారు. రాబోయే వినాయక చవితి పండుగకు మట్టి వినాయకులను పూజిస్తూ ప్లాస్టిక్ నివారించడానికి ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణలో పాల్గొని మొక్కలను నాటాలని కోరారు. ఈ సందర్భంగా జై గణేష్ భక్త సమితి సభ్యులకు ఎమ్మెల్సీ జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శరత్ చంద్ర, న్యూ మారుతి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నోముల కృష్ణమూర్తిగౌడ్, కార్యవర్గ సభ్యులు తిరుమల్‌రెడ్డి, కిషన్, సంతోష్ పాల్గొన్నారు.

రాములోరికి లడ్డూ నివేదన అభినందనీయం

సైదాబాద్: అయోధ్య రామునికి నగరవాసి భక్తితో 1265 కిలోల లడ్డూను నివేదించడం అభినందనీయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరాలు వెల్లడించారు. అయోధ్యలో భవ్య రామమందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రోజు నుంచి ఆలయం ప్రారంభించే వరకు 1265 రోజులైనందున వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన భక్తుడు నాగభూషణం రెడ్డి శ్రీబాల రామచంద్ర స్వామికి 1265 కిలోల లడ్డూను తయారు చేయించారు. మంగళవారం ఆ లడ్డూను ఉంచిన ప్రత్యేక వాహనాన్ని ఏపీఏయూ కాలనీలోని ధర్మ నిలయానికి తీసుకొచ్చారు. అక్కడ ధర్మ నిలయం మాతా, భక్తులు, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు లడ్డూను దర్శించుకొని హారతులిచ్చారు. ప్రత్యేక ఏర్పాట్లు చేసిన లడ్డూ ఉంచిన వాహనం మూడు రోజుల్లో అయోధ్యకు చేరుకుంటుందని సురేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రమేష్‌రాజు, వెంకటేశ్వర రాజు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు సుందర్‌రెడ్డి, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, ఏపీఏయూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగెల విజయ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యకు తరలించనున్న లడ్డూ వాహనంతో సురేందర్‌రెడ్డి

ముగిసిన మల్లన్నస్వామి కల్యాణోత్సవం

సైదాబాద్: కరణ్‌బాగ్‌లోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో మల్లన్నస్వామి కల్యాణం, జాతర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడురోజులు నిర్వహించిన జాతర ఉత్సవాలు సోమవారం అమ్మవార్లకు బోనాలు, ఒడిబియ్యం సమర్పణతో పూర్తయ్యాయి. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కరణ్‌బాగ్ పార్క్ నుంచి భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి ఆలయంలో కొలువుదీరిన రేణుకాఎల్లమ్మ, నల్లపోచమ్మ, మహంకాళి అమ్మవార్లకు బోనాలు, వడిబియ్యం సమర్పించారు.

ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి

- గ్రేటర్‌లోనే మొదట పూర్తి చేసిన ఎల్‌బీనగర్ జోనల్
- మొత్తం దరఖాస్తులు 3,16,919
- ఐదు గ్యారంటీలకు : 2,35,278
- రేషన్ కార్డులు తదితరాలకు : 81,641


ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అధికారులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో అభయ హస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తయిందని అధికారులు తెలిపారు. గ్రేటర్ పరిధిలోనే ఎల్‌బీనగర్ జోనల్ ప్రజాపాలనలో వచ్చిన మొత్తం దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచిందని అధికారులు వెల్లడించారు. అభయ హస్తంలోని ఐదు గ్యారంటీలకు 2,35,278 దరఖాస్తులు రాగా, రేషన్ కార్డులు, ఇతర అంశాలపై 81,641 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల ప్రక్రియలో మొదటగా డేటా ఎంట్రీ చేసే పనిని ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చారు. ఎల్‌బీనగర్ జోనల్ దరఖాస్తులను డేటా ఎంట్రీ చేసేందుకు తరలిస్తుండగా బాలాగనర్ వద్ద ద్విచక్ర వాహనం పైనుంచి జారి పడిపోయాయి. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఎల్‌బీనగర్ సర్కిల్-3 ట్యాక్స్ సెక్షన్ సూపరింటెండెంట్ మహేందర్‌ను సస్పెండ్ చేశారు. దీంతో అప్రమత్తమైన అధికారులు దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తూ తప్పులు లేకుండా సకాలంలో పూర్తి చేశారు.

సర్కిళ్ల వారీగా దరఖాస్తులు ఇలా...

సర్కిళ్ల వారీగా ఆరు గ్యారంటీల కోసం కాకుండా ఇతర పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య 3,16,919 కాగా, ఇందులో 2,35,278 మంది కేవలం ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

సర్కిల్	ఆరు గ్యారంటీల పథకాలు	ఇతర పథకాలు
1. కాప్రా	62,743 మంది	20,924
2. ఉప్పల్	43,271 మంది	14,791
3. ఎల్‌బీనగర్-3	48,801 మంది	18,781
4. ఎల్‌బీనగర్-4	40,765 మంది	11,937
5.ఎల్‌బీనగర్ -5	39,698 మంది	15,208